www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 నవంబర్ 2024
5
కాకినాడ



నేడు, రేపు గిరిజన కమిషన్ సభ్యులు పర్యటన

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లాలోని శంఖవరం, రౌతులపూడి మండలాల్లో పర్యటిస్తారని కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 22 వ తేదీ ఉదయం 7.30 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు శంఖవరం మండలం అనుమర్తి, అవేల్తి, ఒంద్రిగుల గ్రామాల్లో పర్యటిస్తారు. గిరిజనులతో మాట్లాడారు. సాయంత్రం నాలుగు గంటలకు జెఎన్‌టియుకె అతిథి గృహానికి చేరుకుంటారు. 23వ తేదీన ఉదయం 7 గంటలకు జెఎన్‌టియు నుంచి బయలుదేరి రౌతులపూడి మండలం పెద్దూరు, గిన్నలరం గ్రామస్తులతో భేటీ అవుతారు. అనంతరం కాకినాడ చేరుకుని, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం విజయవాడ వెళతారని కలెక్టర్ తెలిపారు.

ఆధార్ అవస్థలెన్నో..!

- అపార్ ఐడి కోసం మార్పులు, చేర్పులు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం


ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రతి విద్యార్థికి 'అపార్' కార్డు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నహాలు చేస్తోంది. ఆధార్ కార్డు తరహాలోనే విద్యార్థులకు కూడా ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డులు రానున్నాయి. దీనిలో భాగంగా కేజీ నుంచి పీజీ వరకూ చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. కార్డుపై క్యూఆర్ కోడ్‌తోపాటు 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. ఇదంతా బాగానే ఉన్నా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వలన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అపార్ కార్డుల కోసం ఆధార్‌లో మార్పులు, చేర్పులు అనివార్యంగా మారాయి. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుల్లో మార్పులు కోసం విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు.

జిల్లాలో 1,37,374 మంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉండగా ఇప్పటివరకూ 1,22,492 మందికి అంటే 89 శాతం అపార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి అయింది. 96,081 మంది ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 78,213 మందికి, 60,089 మంది హైస్కూల్ విద్యార్థులకు 40,618 మందికి మొత్తంగా 1 నుంచి 10 వ తరగతి వరకూ 82 శాతం మందికి ఎన్‌రోల్‌మెంట్ పూర్తయింది. అలాగే 11 నుంచి 12 వరకూ విద్యార్థులకు కేవలం 40 శాతం మాత్రమే జరిగింది. ఇంకా అనేకమంది అపార్ సంఖ్య కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

వేలమంది విద్యార్థులకు ఆధార్ కార్డుల్లో అనేక తప్పులు ఉన్నాయి. జనన ధ్రువీకరణ పత్రాలకు ఆధార్ కార్డుల్లో వివరాలకు చాలామందికి పొంతన కుదరడం లేదు. ఈ నేపథ్యంలో ఆధార్ సంఖ్య కోసం విద్యార్థులు పోస్ట్ ఆఫీసులు, ఆధార్ నమోదు కేంద్రాలు, మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ మార్పులు, చేర్పుల కోసం కొన్ని రోజులుగా ప్రదక్షిణలు చేస్తున్నారు. కాకినాడ కోశాయి చెరువు సెంటర్ వద్ద ఆధార్ నమోదు కార్యాలయంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కోలాహలంగా మారింది. ప్రతిరోజూ వందలాదిమంది విద్యార్థులు ఆధార్లో తప్పులు సరిచేసుకునేందుకు ఇక్కడకు వస్తున్నారు. దీంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. అలాగే మెయిన్ రోడ్‌లో ఉన్న హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద కూడా భారీ సంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారు. తెల్లవారుజాము నుంచే ఆయా కేంద్రాల వద్దకు చేరుకుని తప్పులను సరి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. అలాగే జనన ధ్రువీకరణ పత్రాల్లో చాలామందికి పేర్లు తప్పుగా నమోదు అయ్యాయి. వాటిని సరిచేసుకునేందుకు అనేక కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. కొన్నిచోట్ల ఇదే అదనుగా భావిస్తున్న కొందరు సిబ్బంది భారీ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేగంగా సరి చేయాలంటే సొమ్ములు ముట్ట చెప్పాల్సిందే అంటూ డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. వన్ నేషన్-వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ అపార్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టడంతో ఈ ఇబ్బందులు ఏర్పడ్డాయి. కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్యను కేటాయించనుంచనుందని విద్యాశాఖ అధికారులు తెలియజేసి వేగంగా ప్రక్రియ ముగియాలని ఆదేశించడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. మరోవైపు యంత్రాంగం తగిన చర్యలు తీసుకోకపోవడం వలన కష్టాలు తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

రెండు రోజులుగా తిరుగుతున్నా...



ఆధార్‌లో పేరు తప్పుగా నమోదయింది. అపార్ సంఖ్య కోసం వెంటనే తప్పుని సరి చేసుకోవాలని ఉపాధ్యాయులు చెప్పడంతో రెండు రోజులుగా కాకినాడ ఆధార్ నమోదు కేంద్రం చుట్టూ తిరుగుతున్నాను. ఎక్కడ చాలా మంది వస్తుండడం వల్ల బిజీగా ఉంది.

-వి.సునీల్ రెడ్డి, విద్యార్థి, యు. కొత్తపల్లి మండలం

ప్రక్రియ చాలా ఆలస్యం అవుతుంది



మా పాప దీపిక ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆధార్లో తప్పుని సరిచేసుకోవాలని చెప్పడంతో గత రెండు రోజులుగా ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నాము. భారీ సంఖ్యలో విద్యార్థులు రావడంతో ప్రక్రియ చాలా ఆలస్యం అవుతుంది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

వీరబాబు, విద్యార్థి తండ్రి, జగన్నాథపురం, కాకినాడ


తమ సమస్యలను పరిష్కరించాలని నినదిస్తున్న మత్స్యకారులు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నగరంలోని మత్స్య మార్కెట్లలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కార్యవర్గ సభ్యురాలు సిహెచ్.రమణి, జిల్లా నాయకులు యు.సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్య కారుల ఉపాధి ప్రమాదంలో పడిందని, కాలుష్య కారక పరిశ్రమలు వల్ల మత్స్య సంపద నాశనం అవుతుందన్నారు. వరుస తుపానుల వల్ల వేట లేక, మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం వారిని ఆదుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఐదు నెలలు గడిచిన నేటికి మత్స్యకారుల వేట నిషేధ భృతిని అందజేయ లేదన్నారు. మార్కెట్‌లో సౌకర్యాలు లేవని, పెద మార్కెట్ లో చేపల మార్కెట్‌కు రక్షణ లేదని, పార్కింగ్ లేక కొనుగోలుదారులు రావడం లేదని అన్నారు. తీర ప్రాంత మత్స్య కారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, కూటమి ప్రభుత్వం మత్స్య కారులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారం చేసుకునే వారికి ఐస్ బాక్సు, రుణాలు, మోటార్ సైకిల్స్, బోట్‌లు ఇవ్వాలని, ఆయిల్ సబ్సిడీ పెంచాలని కోరారు. బ్లూ ఎకానమీ పాలసీతో కేంద్రం మత్స్య కారులను దెబ్బకొట్టే చర్యలు చేపట్టిందని, మత్స్యకారుల కష్టంతో దేశంలో రూ.10 వేల కోట్ల డాలర్ల విదేశీ వ్యాపారం జరుగుతుందని, అయినా వారిని ఆదుకోవడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఒఎన్‌జిసి లాంటి ఆయిల్ కంపెనీల వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు పరిహారం ఇవ్వాలని, దీనికి కాకినాడ పరిసర 18 గ్రామాల్లో సర్వే నిర్వహించాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రాజశేఖర్, సుధా, దుర్గాదేవి, రాంబాబు, లోకాలమ్మ, స్వరూప, అప్పలనర్స, సింహాచలం, ధనలక్ష్మి పాల్గొన్నారు.

బాలిక మృతిపై వైద్య బృందం విచారణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ శివారు సుబ్బంపేట గ్రామానికి చెందిన మైలపల్లి స్వప్న (16) మృతిపై వైద్యాధికారులు గురువారం విచారణ చేపట్టారు. మంగళవారం రాత్రి జ్వరం, వాంతులతో వచ్చిన బాలికకు పిఎంపి వైద్యుడు ఇచ్చిన ప్రాథమిక వైద్యంపై ఆరా తీశారు. పిఎంపి నిర్వహిస్తున్న మెడికల్ షాపులో తనిఖీలు చేపట్టారు. బాలిక కుటుంబ సభ్యుల వాగ్మూలంతోపాటు, పిఎంపి వైద్యుని వాగ్మూలాన్ని నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పిఎంపి వైద్యుడి క్లినిక్‌తోపాటు, మెడికల్ షాపును సీజ్ చేసినట్లు విచారణ బృందం అధికారులు తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. విచారణ బృందంలో జిల్లా ఇమ్యునిజషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ టి. మురళి, జిల్లా గణాంకాధికారి విజయలక్ష్మి, కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యురాలు సిహెచ్.సుష్మ ఉన్నారు.


బాధిత కుటుంబాన్ని విచారిస్తున్న వైద్య బృందం

ఎంతటి పోరాటానికైనా సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద క్లాప్ వాహన డ్రైవర్లు చేస్తున్న శిబిరాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని, అటువంటి వారికి 3 నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు వెంటనే కలగజేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి పోరాటానికి సిఐటియు కార్మిక సంఘాల తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఇదేవిధంగా క్లాప్ డ్రైవర్ సమస్యలు పరిష్కరించకుండా అధికారులు దాట వేసే వైఖరితో వ్యవహరిస్తే మున్సిపల్ కార్యాలయం ముట్టడికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఉద్యమాన్ని చేపట్టి 28 రోజులు అవుతుంటే జీతాలు వేయించే విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, ఇస్మాయిల్, శివశంకర్, గంగాధర్, రాజు, వెంకటేష్, సూరిబాబు, దుర్గ బాబు, శివ, రమణ పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న బేబీరాణి

చెత్త నుంచి సంపదను సృష్టించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పెదపూడి

జిల్లాలో చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. గురువారం మండలంలోని రామేశ్వరం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూపిసి, ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్లుతోపాటు, రెవెన్యూ కార్యాలయం, సిహెచ్‌సిని సందర్శించారు. తొలుత గోగులమ్మ తల్లి గుడి దగ్గర ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను ఆయన పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సిని పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలోని మరుగుదొడ్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, అవుట్ పేషెంట్ వివరాలు, నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న అదనపు భవనాలను, ఫార్మసిస్ విభాగం, ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన ఈ నిర్మాణ పనులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇసుక, ఇతర మెటీరియల్ అందుబాటులో ఉండే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేవించారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ పివి.సీతాపతిరావు, ఎంపిడిఒ కె.నరేంద్రరెడ్డి, పాల్గొన్నారు.


ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 5వ వార్డు పరిధిలోని తాడితోట శివారు కాలనీలో పూడుకు పోయిన డ్రెయిన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ పర్యవేక్షణలో గురువారం పూడిక తీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని పూడికతీత పనులు చేపట్టామన్నారు. జెసిబితో పూడిక తొలగించడమే కాకుండా శానిటరీ సిబ్బంది మురికి నీటి ప్రవాహ అడ్డంకులను తొలగించారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ విడ దాసరి రాజా, సానిటరీ సెక్రటరీ సిహెచ్.ప్రత్యూష, సిబ్బంది పాల్గొన్నారు.



పనుల పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

తోటపేట రహదారికి మోక్షం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పోలేకుర్రు పంచాయితీ తోటపేటకు వెళ్లే చిద్రమైన రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఈ రహదారి గుంతల మయంగా మారింది. సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు రహదారిని చదును చేయించి మట్టితో గుంతలను పూడ్చారు. దీంతో ఆ ప్రాంత రైతులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


జెసిబితో రహదారికి మరమ్మతులు

విద్యా సంస్థల ఛైర్మన్‌కు పౌర సన్మానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా వినయ సంపన్న బిరుదు పొందిన ఎర్రవరం సూర్య విద్యాసంస్థల ఛైర్మన్ కెవివి.సత్యనారాయణ దంపతులను విద్యా ర్థులు, గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దా లనే లక్ష్యంతో ఎర్రవరంలో సూర్య విద్యా సంస్థను ప్రారంభించానని అన్నారు. అందరి సహకారంతో అంచలం చెలుగా విద్యా సంస్థను అభివృద్ధి చేసి నేడు డిగ్రీ స్థాయి వరకూ తీసుకొచ్చినట్లు తెలిపారు. మెట్ట ప్రాంతంలో మొట్టమొదటి సారిగా బిఎస్‌సి నర్సింగ్ కోర్స్‌ను తీసుకొచ్చినట్లు వివరించారు. జిల్లాలోని అతి తక్కువ ఫీజులకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్న ఘనత తమ విద్యా సంస్థలకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిశెట్టి అప్పలరాజు, టిడిపి నేత మైరాల కనకారావు, తోట హరిబాబు, బట్ట రాంబాబు, కళాశాల ప్రిన్సిపల్ ఎలమంచిలి శేఖర్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఛైర్మన్ దంపతులను సత్కరిస్తున్న స్థానికులు

అపార్ కోసం విద్యార్థుల కష్టాలు

ప్రజాశక్తి - శంఖవరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ ఐడితో విద్యార్థులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా సూరిబాబు అన్నారు. గురువారం అన్నవరం సత్యదేవ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అపార్ ఐడి కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు గత 10 రోజులుగా అపార్ ఐడి కోసం పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ ఐడితో విద్యార్థులు ఆధార్, మీసేవ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. గత 10 రోజులుగా విద్యార్థులు విద్యా సంస్థలకు దూరంగా ఉంటున్నారని అన్నారు. కావున ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆయా విద్యా సంస్థల్లోనే తప్పుప్పొలు సరిదిద్దేందుకు వీలుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులకు కావలసిన సర్టిఫికెట్లు అన్నింటిని తక్షణమే మార్పులు చేర్పులు చేయాలని కోరారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు సూరిబాబు

పంచాయతీలకు నిధుల విడుదలపై హర్షం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నిస్సహాయ స్థితిలో ఉన్న గ్రామ పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కృషితో ఉపాధి హామీ, ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంపై మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాలనే ఆశయంతో స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేశారని అన్నారు. ఇటీవల వరదల సమయంలో ఒక్కొక్క పంచాయతీకి రూ. లక్ష చొప్పున 400 పంచాయతీలకు పవన్ కళ్యాణ్ తన సొంత నిధులు రూ.4 కోట్లు అందజేశారని గుర్తు చేశారు.

నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

న్యాయవాధిని నడిరోడ్డులో హత్య చేసిన నింతుడిని తక్షణమే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్(ఐలాజ్) డిమాండ్ చేసింది. గురువారం కోర్టు ప్రాంగణంలో ఐలాజ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలాజ్ రాష్ట్ర కన్వీనర్ బుగతా శివ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హెూసూర్‌లో న్యాయవాది కన్నన్‌ను నడిరోడ్డుపై హత్య చేయడం దారుణమన్నారు. న్యాయవాదులపై దాడులు జరుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శంచారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అవసరాల దేవి, జోగా ప్రసాద్, బొంగుళూరు మధుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


గొర్ల వెంకట్రావు, మంగయ్య అమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పాత ఇసుకపల్లి ఎంపిపి పాఠశాలలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ గొర్ల పెద్దిరాజు, సునీత దంపతులు మాట్లాడుతూ తమ ట్రస్ట్ 19వ వార్షికోత్సవం సందర్భంగా 80 మంది విద్యార్థులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గడచిన 19 సంవత్సరాల నుంచి పాఠశాలలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు, బహుమతిలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతపల్లి ముల్లారెడ్డి, ఎరకం సుబ్బిరెడ్డి, పెనుమల్లు వివి.సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు, విద్యార్థులు, వారి తల్లీదండ్రులు పాల్గొన్నారు.

ఊర చెరువుకు వేలం

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక పంచాయతీకి చెందిన ఊర చెరువుకు పంచాయతీ కార్యదర్శి సత్యరామనాథ్ ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. ఈ పాటలో నలుగురు డిపాజిట్ కట్టి వేలంపాట కొనసాగించగా రూ.6.30 లక్షలకు గ్రామానికి చెందిన కంటిపూడి వీర వెంకట సత్యనారాయణ పాడుకున్నారు. 3 సంవత్సరాల కాల పరిమితితో వేలం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

కార్టూ'నిజం'



డాక్టర్ యనమదలకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రముఖ వైద్యులు డాక్టర్ యనమదల మురళీకృష్ణకు అరుదైన గౌరవం లభించింది. ఆయన రాసిన వ్యాసం జర్నల్ ఆఫ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(జిమా)లో ప్రచురితమైంది. ఈ సందర్భంగా ఆయన గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. గత 27 సంవత్సరాలుగా ఎయిడ్స్ రంగంలో విశేషమైన కృషి చేస్తున్నందుకు ఈ అవకాశం దక్కిందని తెలిపారు. 1997 నుంచి ఎయిడ్స్, ప్రజారోగ్య రంగాలలో కృషి చేస్తున్నానని, హెచ్ఐవి జబ్బులో క్షయవ్యాధి గురించి చేసిన పరిశోధనతో తెలుగు రాష్ట్రాల నుంచి తాను సమర్పించిన మొదటి, ఏకైక శాస్త్రీయ పరిశోధన సారాంశం 2000 సంవత్సరంలో జరిగిన 13వ అంతర్జాతీయ ఎయిడ్స్ సదస్సులో ప్రచురితమై దన్నారు. ప్రపంచవ్యాప్త పరిశోధనలలో విశిష్టమైన 25 పరిశోధనలలో ఒకటిగా నిలిచిందని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధి చికిత్సలో 1996 నుంచి ప్రపంచ వ్యాప్తంగా మూడు ఔషధాల కాంబినేషన్ అనుసరిస్తున్నట్లు తెలిపారు. దాని స్థానంలో తాను అనుసరిస్తున్న రెండు ఔషధాల మిశ్రమం చికిత్స గురించిన పరిశోధన సారాంశం 2004లోనే అంతర్జాతీయ సదస్సులో ప్రకటించారన్నారు. 2022 చివరి నుంచి అమెరికా, యూరోపియన్ చికిత్స మార్గదర్శకాలలో రెండు ఔషధాల చికిత్స కూడా చోటు చేసుకుందని, జన బహుళ్యంలో ఎయిడ్స్ గురించి అవగాహన పెంచడానికి పలు పత్రికలలో అనేక వ్యాసాలను రాశానని తెలిపారు. 2000లో తెలుగులో ఎయిడ్స్ పుస్తకాన్ని ప్రచురించానని, కోవిడ్ పీడ సమయంలో తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ భరోసానిచ్చానని తెలిపారు. 2022 జనవరిలో వెలువరించిన 'కోవిడ్ ఎయిడ్స్ నేను' పుస్తకం విశేష ఆదరణ పొందిందన్నారు. ఈ ఏడాది మార్చిలో 'హెచ్ఐవి ఎయిడ్స్' పుస్తకాన్ని తెలుగులో ప్రచురించినట్లు తెలిపారు.


డాక్టర్ మురళీకృష్ణ


నూతన పాలకవర్గంతో ఎన్‌జిఒ సంఘ నేతలు

ఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షునిగా సీతారామస్వామి

ప్రజాశక్తి- సామర్లకోట

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా యూనిట్ నూతన అధ్యక్షునిగా ఎం.సీతారామస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సామర్లకోట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కో ఆప్షన్ ప్రక్రియ పద్ధతిలో జిల్లా ఉపాధ్యక్షులు కుడిపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షునిగా ఎం సీతారామస్వామి, అసోసియేట్ అధ్యక్షునిగా వైటి రామారావు, ఉపాధ్యక్షులుగా ఆర్.జమీనాకుమారి, టి.సత్యనారాయణ, పి.చరణ్‌కుమార్, కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్, బి.దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శులుగా పివిఎస్.శ్రీనివాస్, బి.అనిల్‌కుమార్, మహిళా జాయింట్ కార్యదర్శిగా డి.రామకుమారి కోశాధికారిగా జె.జేజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీని పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ మాట్లాడుతూ సంఘ అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మురారి గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. అలాగే కాట్రావులపల్లిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవచేసిన 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గురువారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. తాళ్లరేవు గొల్లలపేట నుంచి చొల్లంగిపేటకు నిశ్చితార్థ వేడుకకు సంబంధించింది రెండు ఆటోల్లో పలువురు బయలు దేరారు. ఆటో జి.వేమవరం జామకాయల తూము సెంటర్‌కు చేరుకునే సరిగా కాకినాడవైపు నుంచి వస్తున్న బైకును ఢీకొన్ని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏసూరి గనికమ్మ, శవల చెల్లయమ్మ, తట్టుగళ్ల లోవ, మందాల దుర్గమ్మ, బాలుడు సాయి గణేష్ గాయపడ్డాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సునీల్‌కు స్వల్ప గాయమైంది. అలాగే మండలంలోని జార్జిపేట పోలేకూరు వై.జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం మండలం జనిపల్లికి చెందిన కుడిపూడి మధనేశ్వరరావు బైకుపై కాకినాడ వైపు వెళ్తున్నాడు. వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి బారికేడ్‌ను ఢీకొని కింద పడిపోయాడు. అదే సమయంలో అమలాపురం నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు అతని రెండు కాళ్లపై నుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయడ్డాడు. అతన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - గండేపల్లి

రంగంపేట మండలం సింగంపల్లి, అనపర్తి మండలం పులగుర్తలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 124 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు విక్రయదారులను అరెస్టు చేసినట్లు రంగంపేట ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో మంగళగిరి ఎస్‌టిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట సర్కిల్ పరిధిలో గురువారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి రెండు రోజులపాటు జైలు శిక్ష ఖరారు అయిందని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మరో 11 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మరణించిన సంఘటన గురువారం మండలంలోని కె.సావరంలో చోటు చేసుకుంది. మాదాసు నాగేంద్ర (35), నెక్కంటి పవన్ పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నారు. ఇంటి వద్ద పెయింటింగ్ పనులు ఉండడంతో నాగేంద్ర పనిచేస్తున్న హాస్పటల్ నుండి నిచ్చెన తీసుకొనివచ్చి, తిరిగి ఇచ్చేందుకు తీసుకు వెళుతున్న క్రమంలో నిచ్చెన విద్యుత్ వైర్లకు తాకి, షాక్ తో సంఘటనా స్థలంలోనే మతి చెందాడు. నాగేంద్రకు భార్య గాయత్రి, ఒక సంవత్సరం పాప ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన అదే గ్రామానికి చెందిన మోర్తా కిషోర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సిఐ సూర్యఅప్పారావు తెలిపారు. నిందితుడును కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు విధించినట్లు తెలిపారు. పట్టుకోవడంలో ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - కిర్లంపూడి

కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను సందర్శించి, పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ జి.సతీష్ పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీల ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తమను స్థానిక వైసిపి నాయకులు ఘోరంగా అవమానించారంటూ తాపీ మేస్త్రీలు గురువారం ఏలేశ్వరం బాలాజీ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీల సంఘం నాయకులు నందకూరి నాగ శంకర్, గెద్ద అప్పన్న, దనేడి చిన్న మాట్లాడారు. వైసిపి పాలనలో తాపీ మేస్త్రీల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆ స్థలంలో తమ సంఘీ యులంతా ఇటీవల కార్తీకమాసం పురస్కరించుకుని వన సమారాధన కార్యక్రమం నిర్వహించుకున్నట్లు చెప్పారు. దీనిపై స్థానిక వైసిపి నాయకులు తాము ఆ స్థలాన్ని కబ్జా చేశామని తహశీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి తీవ్రంగా అవమానించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలివెల శ్రీను, కర్రోతు మన్నియ్య, గెద్ద అప్పన్న, ఎల్లంశెట్టి రాము, కిలాడి శ్రీను, కాకాడ రాజు, బోనుమతి శ్రీను పాల్గొన్నారు.

వల్లభ స్వామిని దర్శించుకున్న ఎన్నికల పర్యవేక్షకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామిని గురువారం ఎంఎల్‌సి ఎన్నికల పర్యవేక్షకులు హర్షవర్ధన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విమానాశ్రయం వద్దు

-జనసేన జనవాణి కార్యక్రమంలో రైతులు వినతి

ప్రజాశక్తి - తొండంగి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

మండలంలోని బెండపూడి వద్ద ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన విమానాశ్రయాన్ని మరో ప్రాంతానికి తరలించాలని ఆ ప్రాంత రైతులు కోరారు. గురువారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో రైతులు పాల్గొని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. తమ ప్రాంతంలో ఏడాదికి రెండు పంటలు పండే భూములని, అటువంటి భూముల్లో విమానాశ్రయాన్ని నిర్మిస్తే సన్న, చిన్నకారు రైతుల జీవితాలు నాశనం అవుతాయని వివరించారు. కావున విమానాశ్రయ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ స్పందిస్తూ ఇదే అంశాన్ని కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్తానని, రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారని రైతు పోరాట కమిటీ అధ్యక్షులు పాలచర్ల భాస్కరరావు తెలిపారు. అలాగే తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పాలంకి పట్టాభిని రైతులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తమ భూములను విమానాశ్రయానికి తీసుకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణ ఆలోచనను విరమించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పెద్దాపురప్పాడు విద్యార్థులు

ప్రజాశక్తి - కరప


విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలకు పెద్దాపురప్పాడు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్-ఎన్ ఎన్ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. స్కూల్ గేమ్స్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్ బాల్ అండర్ 14, అండర్ 17 ఎంపికలు గత నెల 26న ఐ.పోలవరం మండలం జి వేమవరం జడ్‌పి హైస్కూల్లో జరిగాయి. అండర్ 17 విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాలుర విభాగంలో వై.సుధీర్, డి.సూర్యవెంకటమణికంఠ, జి.వీరమణికుమార్ రాష్ట్ర స్థాయిలో ఈ నెల 23 నుంచి 25 వరకూ అనంతపురం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థులు బాలుర విభాగంలో ఎన్.నాగేంద్ర, బి.అంజనీ కుమార్, బాలికల విభాగంలో సిహెచ్.విజయలక్ష్మి, కె.అనురాధ ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకూ చిత్తూరు జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు బివివిఎస్‌వి.ప్రసాద్‌లను ఎస్‌ఎంసి ఛైర్మన్ యాళ్ల నాగమణి, ఇతర ప్రజాప్రతినిధులు అభినందించారు.

యానాం వార్తలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

26న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - యానాం

నవంబర్ 26న దేశవ్యాప్తంగా జరుగుతున్న ధర్నాలో భాగంగా యానాంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ కోరారు. గురువారం స్థానికంగా ప్రజా సంఘాల నాయకులు ఇళ్ల వాసు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక, రైతు సంఘాలు నవంబర్ 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలను చేపడుతున్నాయని అన్నారు. ఈ ధర్నాలో కేంద్ర కార్మిక సంఘాలతోపాటు, రైతు సంఘాలు, ప్రజలు భాగస్వాములై తమ నిరసనను తెలియ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ధర్నాకు సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్బతి రాంబాబు, తిరికోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, తాడిపల్లి మధుబాబు, పూడి సత్తిబాబు, పంపన మధుబాబు, సీలం దుర్గాప్రసాద్, కొండి చలం, యాదల శ్రీనివాసరావు, వెంకన్న బాబు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు 'కవితా నిధి' పురస్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం


పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

పెద్దాపురం సాహితి స్రవంతి సభ్యుడు పూడి శ్రీనివాసరావును విశాఖపట్నం శివానంద చారిటబుల్ ట్రస్ట్ 'కవితా నిధి' పురస్కారంతో సత్కరించింది. గురువారం ఎర్రవరం సూర్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు కళాశాల అధినేత కెవి.రమణ, జగ్గంపేట రుచి హోటల్ అధినేత నాగేంద్ర చౌదరి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు, సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ, గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, ఉప్పుటి రవి, జయశ్రీ, మంజుల, ప్రజానాట్యమండలి మండల అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్తిబాబు, రొంగల వీర్రాజు, దారపు రెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు, దారపురెడ్డి సత్యనారాయణ, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు

జిల్లాలో పలు ప్రాంతాల్లో సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.రామ కృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరాల అధికంగా జరుగుతున్నాయని అన్నారు. ఈజీ మనీ సంపాదించడం పట్ల విద్యార్థులు యువత పక్కదారి పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **గండేపల్లి** సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సిఐ వైఆర్‌కె.శ్రీనివాసరావు, ఎస్ఐ యువి.శివనాగబాబు పాల్గొని మాట్లాడారు. సమాజంలో జరిగే వివిధ సైబర్ నేరాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి.హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, కె.సత్యనారాయణ, జి.నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు. **పిఠాపురం** మండలంలోని విరవాడ గ్రామంలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సిఐ జి.శ్రీనివాస్ పాల్గొని వివిధ సైబర్ నేరాలకు సంబంధించిన విషయాలపై ప్రొజెక్టర్ స్క్రీన్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ గుణ శేఖర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. **కోటనందూరు** స్థానిక మదర్ విద్యా సంస్థల్లో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ టి.రామకృష్ణ మాట్లాడుతూ మొబైల్స్ వినియోగం పెరగడం వల్ల సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. సైబర్ నేరాలు నివారణకు యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మదర విద్యాసంస్థల ఛైర్మన్ పెనుముచ్చు నాగేశ్వరరావు పాల్గొన్నారు. **కరప** మండలంలోని పెనుగుదురులోని సంధ్య ఫిజియోథెరఫీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి.సునీత పాల్గొని సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. **జగ్గంపేట** స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ రఘునాథరావు ప్రయాణికుల అనుమానాలను నివృత్తి చేశారు.

అపార్ అప్‌డేషన్‌పై సమీక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలో జరుగుతున్న అపార్ అప్‌డేషన్‌పై డిఎల్‌పిఒ పి.వాసుదేవరావు సమీక్షింఆరు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ, ఎంఇఒ, ఇతర సిబ్బందితో జరిగిన ఈ సమావేశంలో ఆయన ఆధార్, జియో టాగింగ్‌లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే మండలంలో ఎన్‌పిసిఐ హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ హిమామహేశ్వరి, ఎంఇఒ శివరామకృష్ణయ్య, ఇఒపిఆర్‌డి భైరవమూర్తి, పాల్గొన్నారు.

రాగంపేటలో రీ సర్వే గ్రామ సభ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట సచివాలయం వద్ద గురువారం రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ కె.కాంతారావు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామ సభలో 75 అర్జీలు అందాయని డిటి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సామో రు, గ్రామ సర్వేయర్ స్ఫూర్తి, విఆర్ఒ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసి, ఆదిత్య డిగ్రీ కళాశాల ఫోరెన్సిక్ గ్రంథాలయ విభాగం, ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్స వాలు ఘనంగా ముగిశాయి. ఈ వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన, క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. వివిధ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్, ఆదిత్య ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, ఫోరెన్సిక్ కళాశాల ప్రిన్సిపల్ చవాన్, బిజినెస్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ భార్గవి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆధార్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిశాల, రాజపూడి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఇఒ ఆర్.స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపార్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ అప్డే చేయడం మార్పులు, పుట్టిన తేదీ మార్పులు చేయించుకునే వారు ఆయా సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలో కాకరపల్లి గ్రామంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల షాపుల్లో వ్యవసాయ ప్రత్యేక తనిఖీ బృందం ఎన్.దైవకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎరువులు షాపుల యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, నిబంధనలో వ్యతిరేకిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపులు వద్ద ఎరువులు, క్రిమిసంహారక మందులు ధరలు పట్టే తప్పనిసరిగా ఉంచాలన్నారు. ఈ తనిఖీలలో పెద్దాపురం ఎడిఎ పివి.శ్రీనివాస్, ఎఇఒ ఎన్.సురేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో మత్స్య దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కాకినాడ, తాళ్లరేవు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి ఫిషరీస్ కోర్సును విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మారుతున్న పరిస్థితులకు, సాంకేతికతకు అనుగుణంగా ప్రవేశపెడుతున్న కోర్సులలో అనేక అవకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కె. కరుణాకరరావు, కాకినాడ ఎస్‌జిఎస్ ఆక్వా సొల్యూషన్స్ ప్రతినిధి తాళ్లూరి మధు, సీఎంఎఫ్‌ఆర్ఐ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ కె.ధన రాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఫిషరీస్ విభాగాధిపతి డాక్టర్ కె.నరసింహమూర్తి, అధ్యాపకులు ఎండి అలీ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు. తాళ్లరేవు మండలంలోని కోరంగి పంచాయతీ కాళ భైరవస్వామి ఆలయ ప్రాంగణంలో గాడిమొగ మాజీ ఎంపిటిసి సభ్యులు మల్లాడి వరదరాజు అధ్యక్షతన ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి పెసింగి ఈశ్వరరావు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, కామాడి మాతరాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు వైదాడి శ్రీనివాస్, గాడిమొగ గ్రామ కమిటీ అధ్యక్షులు సంగాడి కామేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొపనాతి దత్తాత్రేయ వర్మ, అంగాడి తాతారావు, పెసింగి నాగబాబు, ఓలేటి శ్రీను, మల్లాడి సీతారామరాజు, పినపోతు వీరబాబు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం సాగర్ మున్సిపల్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ విద్యార్థులకు లోహాలు, నాన్ మెటల్స్, సున్నితత్వం, కాటిన్యం, ఉపరితలం, విద్యుత్ ప్రసరణ, మానవ కన్ను అనాటమీ, రంగుల ప్రపంచంలో ప్రిజం ద్వారా వక్రీభవనం వంటి అంశాలపై ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించారు.

ప్రభుత్వ కళాశాలలో ఆర్‌జెడి తనిఖీలు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్యాంశ బోధన విధానాన్ని, కళాశాలలో తాగునీరు, టాయిలెట్స్, విద్యార్థులకు కావలసిన ఇతర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రస్తుతం అమలవుతున్న ప్రణాళికను పరిశీలించి తగు సూచనలు చేశారు. అసంపూర్తిగా మిగిలి ఉన్న నాబార్డ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరగా తక్షణమే స్పందించి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృత్తికా శుక్లాకు పరిస్థితిని వివరించి ఎక్యూమ్లేటెడ్ ఫీ ఫండ్ నుంచి రూ.30.5 లక్షలు మంజూరు చేయించారని కళాశాల ప్రిన్సిపల్ వి కేశవరావు తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా 'కిశోర వికాసం'

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కిశోర వికాసం కార్యక్రమాన్ని చేపట్టిందని ఆర్‌డిఒ శ్రీరమణి అన్నారు. గురువారం స్థానిక టిటిడిసి శిక్షణ కేంద్రంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ కొండా ప్రవీణ అధ్యక్షతన విద్యా, వైద్యం, ఇంటర్మీడియట్, సెర్ప్, పంచాయితీరాజ్, ఎన్‌జిఒ విభాగాలకు చెందిన వారితో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అన్ని దశల్లో విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాల, గ్రామస్థాయిలో బాలబాలికల వికాసం, ఆరోగ్య పరిరక్షణ పరిశుభ్రత, పోస్కో చట్టం, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, బాలల హక్కులు పరిరక్షణ,100 శాతం భద్రత అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ బాలికలు ఎన్నో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఆయా సమస్యలపై కిశోర వికాసం ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు టి ఆదిలక్ష్మి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొండా ప్రవీణ మాట్లాడారు. ఈ సందర్భంగా కిశోరి వికాసం అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

తప్పుడు కేసులు పెడితే సహించేదే లేదు

ప్రత్తిపాడు - ప్రజాశక్తి


వివరాలను తెలుసుకుంటున్న ముదునూరి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. గురువారం మండలంలోని ఒమ్మంగి గ్రామంలో పర్యటించి ఇటీవల పోలీసు కేసును ఎదుర్కొన్న వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ రామిశెట్టి బుల్లి రామకృష్ణను పరామర్శించారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందన్నారు. నాని కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంకు శ్రీను, నాయకులు బొల్లు సీతారామరాజు, పిల్లా చిన్న, శెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కోటనందూరు


మరిడియ్యను సత్కరిస్తున్న నాయకులు

దళితుల అభివృద్ధికి కృషి చేస్తానని మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య అన్నారు. గురువారం కోటనందూరు, రౌతులపూడి మండలాల దళిత ప్రగతి ఐక్య సంఘ అధ్యక్షులు కడితే నూకరాజు, బత్తిన అప్పారావు మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్యను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పొందడం కోసం వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడికొండ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో ఎంఎల్ఎ జ్యోతుల భేటీ

ప్రజాశక్తి - జగ్గంపేట


చంద్రబాబుకు వివరిస్తున్న జ్యోతుల

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఎంఎల్ఎ, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ గురువారం సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు అవసరమైన నిధులను కేటాయింపులు చేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు, ఎంఎల్‌సి ఓట్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించినట్లు జ్యోతుల తెలిపారు.